# కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షం

**తెలంగాణలో మూడోసారి బీఆర్ఎస్ గెలుపు తథ్యం**

**నియోజకవర్గంలో నాదే విజయం: ప్రభుత్వ విప్ రేగా**

**నేతలతో కలిసి వెళ్లి రెండు సెట్ల నామినేషన్ల దాఖలు**



బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావుకు హారతినిస్తున్న తోబుట్టువులు

మణుగూరు టౌన్, నవంబర్ 9: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పేర్కొన్నారు. రాష్ట్రంలో మూడోసారి కూడా బీఆర్ఎస్ విజయం సాధించడం తథ్యమని అన్నారు. అలాగే పినపాక నియోజకవర్గంలోనూ తనదే విజయమని తేల్చిచెప్పారు. అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా గురువారం ఆయన నామినేషన్ దాఖలు చేశారు. తొలుత రేగా కాంతారావు తన నివాసంలో తన మాతృమూర్తి పాదాలకు నమస్కరించి ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతరం మణుగూరు పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయం నుంచి బయలుదేరి శ్రేణులతో ఎన్నికల కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం పినపాక నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్‌జైన్‌కు తన రెండు సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు. బయటికి వచ్చిన అనంతరం రేగా తోబుట్టువులు ఆయనకు హారతులిచ్చి ఆశీర్వదించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పినపాక నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీయే గెలవబోతోందని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని తేల్చిచెప్పారు. నియోజకవర్గ ప్రజలందరూ తనకే అండగా నిలుస్తారని, తనకే విజయాన్ని అందిస్తారని అన్నారు. అదే క్రమంలో కాంగ్రెస్ పార్టీ మాయమాటలకు ప్రజలు మోసపోవద్దని సూచించారు. కాగా, రేగా కాంతారావు నామినేషన్ దాఖలుచేస్తున్న సందర్భంగా పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలతో సందడి వాతావరణం నెలకొంది. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పోశం నర్సింహారావు, కిషన్ రావు, జాలె రామకృష్ణారెడ్డి, గోనె దారుగా తదితరులు పాల్గొన్నారు.

# రూ.800 కోట్లతో 'పేట' అభివృద్ధి

- నియోజవర్గంలో 25,957 ఎకరాలకు పోడు పట్టాలు
- అశ్వారావుపేటలో విజయం ఖాయం.. మెజార్టీయే లక్ష్యం..
- బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు
- పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ దాఖలు..
- 50 వేల మెజార్టీ సాధిస్తాం: నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పల



బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చాకు మద్దతుగా తరలిన పార్టీ శ్రేణులు

అశ్వారావుపేట, నవంబర్ 1: గిరిజన నియోజకవర్గమైన అశ్వారావుపేటను రూ.800 కోట్లతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు బీఆర్ఎస్‌దేనని, అందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారని అన్నారు. పట్టణంలో గురువారం భారీ ర్యాలీగా వెళ్లిన ఆయన.. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పల వెంకటరమణతో పాటు ఇతర నాయకులతో కలిసి ఆర్వో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అశ్వారావుపేటలో తన విజయం ఖాయమైందని, మెజార్టీయే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్తున్నానని అన్నారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో 25,957 ఎకరాలకు పోడు పట్టాలు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు.

### 50 వేల మెజార్టీ సాధిస్తాం: ఉప్పల

ఈ నెల 13న దమ్మపేటలో జరిగే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వద సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ అశ్వారావుపేట నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఉప్పల వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈ సభకు 50 వేల జనసమీకరణ చేస్తున్నామని, ఇదే స్ఫూర్తితో 30న జరిగే పోలింగ్‌లో 50 వేల మెజార్టీ సాధిస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో కొందరు నేతలు విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ప్రజలు మాత్రం ప్రశాంత వాతావరణంలో ఓటు వేయాలని కోరారు.

# రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే

- సీఎం కేసీఆరే మూడోసారి ముఖ్యమంత్రి
- ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం
- భారీ అనుచర గణంతో నామినేషన్ వేసిన వెంకట్రావు
- కాంగ్రెస్‌తో పాటు తొమ్మిది మంది పత్రాలు సమర్పణ



నామినేషన్ వేసేందుకు ఆర్డీఓ కార్యాలయంలోకి వస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

భద్రాచలం, నవంబర్ 9 : రాష్ట్రంలో రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, సీఎం కేసీఆర్ ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి అవుతారని ఎమ్మెల్సీ, భద్రాచలం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌ఛార్జ్ తాతా మధుసూదన్ అన్నారు. గురువారం మంచి మూహూర్తం ఉండడంతో భద్రాచలం నియోజకవర్గంలో మొత్తం తొమ్మిది మంది నామినేషన్ పత్రాలు సమర్పించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి డాక్టర్ తెల్లం వెంకట్రావు చర్లరోడ్డులోని బీఆర్ఎస్ కార్యాలయం నుంచి ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి వేలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలతో ప్రచారరథంతో ర్యాలీగా సీతారామచంద్రస్వామివారి ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం భద్రాచలం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకొని రిటర్నింగ్ అధికారి మంగీలాల్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. అలాగే కాంగ్రెస్ నుంచి పొదెం వీరయ్య, బీఎస్పీ, స్వతంత్ర్య అభ్యర్థులుగా మొత్తం తొమ్మిదిమంది నామినేషన్లను ఆర్వోకు అందజేశారు. శుక్రవారంతో నామినేషన్ గడువు ముగియనుంది. అనంతరం ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని స్పష్టం చేశారు. భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తరువాత గ్రామస్థాయి నుంచి నియోజకవర్గం వరకు మా పార్టీ కార్యకర్తలు ఆయన గెలుపునకు అహర్నిశలు కృషి చేస్తున్నారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్ మీద నమ్మకం ఉంచి ఆయన చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను దృష్టిలో పెట్టుకొని నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నుంచి భారీగా బీఆర్ఎస్‌లోకి వలసలు వస్తున్నాయని, రాబోయే వారం, పదిరోజుల్లో ఇంకా చాలామంది బీఆర్ఎస్‌లోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి మరోసారి బుద్ధి చెప్పేందుకు ప్రజలు వేచి చూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు, మానె రామకృష్ణ, బోదెబోయిన బుచ్చయ్య, తాండ్ర వెంకటరమణారావు, గంటా కృష్ణ, ఎండీ నవాబ్ పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో బీఆర్ఎస్‌కు పెరిగిన గ్రాఫ్

- ఐదుగురు సీపీఐ కౌన్సిలర్ల చేరికతో మరింత జోష్
- మరింత కలిసిసొస్తున్న కాంగ్రెస్ నేతల తిరుగుబావుటా..
- ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్ అభ్యర్థి
- నేడు నామినేషన్ దాఖలు చేయనున్న 'వనమా'



సీపీఐ నుంచి బీఆర్ఎస్‌లో చేరాక ఎమ్మెల్యే వనమాను కలిసిన ఐదుగురు కౌన్సిలర్లు

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): కొత్తగూడెం నియోజకవర్గంలో బీఆర్ఎస్ గ్రాఫ్ అమాంతం పెరిగింది. ప్రత్యేకంగా పట్టణంలో అయితే మరింత పెరిగింది. సీపీఐకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు ఇటీవల బీఆర్ఎస్‌లో చేరడంతో మరింత జోష్ పెరిగింది. ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో సీనియర్‌గా ఉన్న వనమా వెంకటేశ్వరరావు కొత్తగూడెం ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. సీఎం సభ తర్వాత బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపయింది. దీనికితోడు ప్రత్యర్థుల బలహీనతలు బీఆర్ఎస్ అభ్యర్థికి మరికొంత బలంగా మారాయి. పొత్తుల్లో భాగంగా కొత్తగూడెం సీటును సీపీఐకి కేటాయించడంతో కాంగ్రెస్‌లో ఒక్కసారిగా అసమ్మతి భగ్గుమన్నది. చివరికి సీపీఐ నామినేషన్‌కు కూడా కాంగ్రెస్ నాయకులు డుమ్మాకొట్టారు. దీంతోపాటు సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు నామినేషన్ రోజునే ఆ పార్టీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే, పాల్వంచకు చెందిన టీపీసీసీ సభ్యుడు ఎడవల్లి కృష్ణ సైతం తిరుబావుటా ఎగురవేశారు. ఈ పరిణామాలన్నీ బీఆర్ఎస్‌కు కలిసొస్తున్నాయి. ఇక ఎమ్మెల్యే వనమా గెలుపు నల్లేరుపై నడకేనన్న మాటలు వినిపిస్తున్నాయి.

**బీఆర్ఎస్‌కు పెరిగిన గ్రాఫ్.. :** కొత్తగూడెం మున్సిపాలిటీలోని 36 వార్డుల్లో 25 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్ వైపే ఉన్నారు. సీపీఐకి ఎనిమిది మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో ఐదుగురు కౌన్సిలర్లు ఇటీవల హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ కొత్తగూడెం అభ్యర్థి వనమా గెలుపునకు కృషి చేసేందుకు ప్రచారానికి దిగారు. మరోవైపు కాంగ్రెస్ సీటు దక్కకపోవడంతో ఆ పార్టీ అధిష్టానంపై అలిగిన నాయకులు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు. దీంతో బీఆర్ఎస్ గ్రాఫ్ ఒక్కసారిగా పెరిగింది. దీంతో గులాబీ జెండా గెలుపుపై ఆ పార్టీ నేతలు ధీమాగా ఉన్నారు.

**నేడు వనమా నామినేషన్.. :** బీఆర్ఎస్ అభ్యర్థి వనమా నియోజకవర్గంలో ఒక విడత ప్రచారం పూర్తి చేశారు. ఇంటింటి ప్రచారం నిర్వహించి బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లారు. బీఆర్ఎస్ కొత్తగూడెం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు కూడా వనమా గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. నామినేషన్ల ప్రక్రియ చివరి రోజైన శుక్రవారం నాడు బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు భారీ ర్యాలీగా వెళ్లి నామపత్రాలు దాఖలు చేయనున్నారు.

# బీఆర్ఎస్‌కు పుష్కలంగా ప్రజాబలం

- కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలే మళ్లీ పట్టం కడతారు..
- ఇల్లెందు ప్రజల అభిమానాన్ని ఎప్పటికీ మరువలేను..
- బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి హరిప్రియానాయక్
- ఎంపీ వద్దిరాజుతో కలిసి నామినేషన్ దాఖలు



ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు/ ఇల్లెందు రూరల్, నవంబర్ 9: బీఆర్ఎస్‌కు ప్రజాబలం పుష్కలంగా ఉందని ఇల్లెందు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి హరిప్రియానాయక్ పేర్కొన్నారు. అందుకే ప్రజలందరూ కలిసి మళ్లీ కేసీఆర్ ప్రభుత్వానికే పట్టం కడతారని అన్నారు. కొంతమంది స్వార్థపరులు పార్టీని వీడుతున్నా నియోజకవర్గ ప్రజలు తనకు మద్దతుగా ఇంత పెద్ద సంఖ్యలో తరలిరావడం తన అదృష్టమని అన్నారు. ఇక్కడి ప్రజల అభిమానాన్ని తాను ఎప్పటికీ మరువలేనని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే అధికారాన్ని మరోసారి కూడా తనకు అందించాలని కోరారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యేకు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా పూలవర్షం కురిపించారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు దిండిగాల రాజేందర్, ఆంగోత్ బిందు, బానోత్ హరిసింగ్‌నాయక్, ఎస్.రంగనాథ్, నాదెండ్ల శ్రీనివాస రెడ్డి, వరప్రసాద్, హన్మంతరావు, తాతా గణేశ్, లక్ష్మణ్‌నాయక్, శీలం రమేశ్, జానీపాషా తదితరులు పాల్గొన్నారు.

**500 మంది వైఎస్ఆర్‌టీపీ కార్యకర్తల చేరిక..** ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై నియోజకవర్గంలోని సుమారు 500 మంది వైఎస్ఆర్‌టీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం జరిగిన ర్యాలీలో వైఎస్ఆర్‌టీపీ ముఖ్య నాయకులు నాగారపు రాములు, ఊకే దశరథ్, బాలాజీనాయక్, కుమార్, బాబురావు, బండి కిరణ్, నర్సింహచారీ, ఎండి.నజీర్, షమీర్, అశోక్, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

**నామినేషన్ దాఖలు చేసిన హరిప్రియనాయక్**

రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి వద్దిరాజు రవిచంద్రతో కలిసి వెళ్లిన బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియానాయక్.. ఇల్లెందు తహసీల్దార్ కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆర్వో కాశయ్యకు నామినేషన్ పత్రాన్ని సమర్పించారు. టీబీజీకేఎస్ నేత ఎస్.రంగనాథ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జానీ పాషా తదితరులు పాల్గొన్నారు.